


కలెక్టర్ ఆకస్మిక తనిఖీ




విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ గౌతమ్

శామీర్‌పేట్: విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ హెచ్చరించారు. మంగళ వారం రాత్రి మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట మండలం, తుర్కపల్లిలోని గల కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, కుత్బుల్లా పూర్, నాంపల్లికి చెందిన మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే, బీసీ వెల్ఫేర్ బాలుర స్కూల్, జూనియర్ కళాశాలను ఆయన మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భం గా కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి భోజన నాణ్యతపై అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. అనంతరం విద్యార్థుతో కలిసి భోజనం చేశారు. శామీర్‌పేట తహసీల్దార్ యాదిరెడ్డి, ఎంపీడీవో మమతాబాయ్, డీసీఓ రాజేష్, ఆర్సీవో వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ షీలా తదితరులు పాల్గొన్నారు.

పులకించిన కీసర క్షేత్రం

- మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తిచేసిన నిర్వాహకులు
- రెండోరోజు కీసరగుట్టలో విశేష పూజలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు మంగళవారం కీసరగుట్ట దేవాలయంలో ప్రత్యేక పూజలు కనుల పండువగా జరిగాయి. మంగళవారం వైదిక కార్యక్రమాల సందానకర్త పుల్లేటికుర్తి గణపతిశర్మ ఆధ్వర్యంలో టీటీడీ వేదపాఠశాల విద్యార్థులు యాగశాలలో యజ్ఞ కార్యక్రమాలు కొనసాగించారు. యజ్ఞశాలల్లో రుద్రస్వాహాకార హోమం, ప్రదోషకాల పూజ, హారతి, మంత్రపుష్పం, పరాకస్తవం, తీర్థప్రసాద వినియోగం తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వేద విద్యార్థులు వేదపారాయణం చేశారు. గర్భాలయంలో కొలువైన స్వామి వారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం అనంతరం వేదపండితులు బిల్వార్చన నిర్వహించారు. – కీసర





గర్భాలయంలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం



యజ్ఞశాలలో కలశపూజ

పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు..

కీసర గ్రామానికి విచ్చేసిన స్వామివారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవానికి కీసరగుట్టకు స్వామి వారిని ఊరేగింపుగా తిరిగి తీసుకెళ్లారు.

స్వామివారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు నగరం నలుమూలల నుంచి యాత్రికులు పెద్దఎత్తున కీసరగుట్టకు చేరుకుంటున్నారు. ఆటోలు, సొంత వాహనాల్లో ఆర్టీసీ బస్సులో కుటుంబసమేతంగా కీసరగుట్టకు చేరుకుంటున్నారు. కాగా గతంలో ఎడ్లబండ్ల మీద కీసర గుట్టకు చేరుకునే యాప్రాల్, అమ్ముగూడ తదితర ప్రాంతాలకు చెందిన తమిళులు ఈసారి మాత్రం ఆటోలు, సొంత వాహనాల్లో గుట్టకు చేరుకున్నారు.

ఆకట్టుకున్న పోచమ్మ అంగడి..

మహాశివరాత్రి ముందురోజు ప్రతిఏటా కీసరలో జరిగే పోచమ్మ అంగడి మంగళవారం ఆనందోత్సాహాల మధ్య జరిగింది. కాప్రా, యాప్రాల్, నగరం నలుమూలల నుంచి ముఖ్యంగా తమిళులు వివిధ వాహనాలల్లో కీసరకు చేరుకుని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు తమ సాంప్రదాయాన్ని పాటిస్తూ.. ఎడ్ల బండ్లపై కీసరకు చేరుకుని పోచమ్మగుడిలో పూజలు నిర్వహించిన అనంతరం కీసరగుట్టపైకి చేరుకున్నారు.

విస్తృత తనిఖీలు..

కీసరగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా గుట్టలో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. డాగ్‌స్క్వాడ్, బాంబుస్క్వాడ్‌లతో జాతర జరిగే ప్రాంతమంతా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

నేటి పర్వదిన పూజా కార్యక్రమాలు..

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నేడు దేవాలయంలో ఉదయం 4 గంటలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, ఉదయం 6 గంటల నుంచి సాముహిక అభిషేకాలు, 9 గంటలకు రుద్రస్వాహాకారహోమం, రాత్రి 8గంటలకు నందివాహనసేవ, రాత్రి 10గంటలకు భజనలు, రాత్రి 12 గంటలకు (లింగోద్భవకాలం) రామలింగేశ్వరస్వామివారికి సంతత ధారాభిషేకం ఉంటుంది.



రుద్రస్వాహకారహోమం చేస్తున్న పండితులు

విద్యుత్ కాంతుల్లో స్వామివారి ఆలయం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా కీసర గుట్ట ఆలయాన్ని విద్యుత్ కాంతులతో కొత్త అందాలను తీసుకొచ్చారు. ఆలయంతో పాటు ఆలయ ప్రాంగణంలో రంగురంగుల విద్యుత్ దీపాలతో కీసరగుట్ట ప్రాంగణాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు.

కలెక్టరేట్‌లో ఉద్యోగుల '2కే వాక్'

సాక్షి,సిటీబ్యూరో: ఆర్థిక అక్షరాస్యత వారోత్సవంలో భాగంగా మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం మైదానంలో అధికారులు, ఉద్యోగులు 2కే వాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ముఖ్యంగా మహిళల్లో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించేందుకు ఆర్బీఐ సూచనల మేరకు కలెక్టరేట్‌లో '2కే వాక్' నిర్వహించినట్లు చెప్పారు.మహిళా శ్రేయస్సు లక్ష్యంగా ఆర్థిక ప్రణాళిక, సూక్ష్మ పొదుపులు, నష్టాల తగ్గింపుపై దృష్టి సారించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికార వర్గాలు ప్రకటించాయి. ఆర్డీఓ హరిప్రియ, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు వినోద్‌కుమార్, ఝాన్సీరాణి, స్వర్ణలత, సాంబశివరావు, రాంమ్మోహన్, కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు

జవహర్‌నగర్: వేసవిని దృష్టిలో ఉంచుకుని నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యల కోసం జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ వసంత, జలమండలి, మున్సిపల్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామన్నారు. నీటిని వృథా చేయొద్దని, వాటర్ పైపుల లీకేజీలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ డీఈ మాధవాచారి, జలమండలి మేనేజర్ కౌశిక్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి నుంచే లక్ష్యాన్ని ఎంచుకోవాలి

జవహర్‌నగర్: జిల్లా పరిషత్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలను జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే తమ లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకుసాగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఉన్నత స్థానాల్లో నిలుస్తున్నారన్నారు. పదోతరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. కాప్రా ఎంఈవో బాపురెడ్డి, అల్వాల్ ఎంఈవో మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కష్టాలకు తాత్కాలిక ఉపశమనం

మేడ్చల్: పట్టణంలో ఉన్న రైల్వే ట్రాక్ అవతలి ప్రాంతంతో పాటు రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు బ్రిడ్జి కింద నుంచి వాహనాలు వెళ్లేలా బ్రిడ్జిని సిద్ధం చేశారు. మేడ్చల్ పట్టణంలో గిర్మాపూర్ రోడ్డు రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం ఏళ్లుగా నత్తనడకన కొనసాగుతోంది. దీంతో పట్టణ పరిధిలోని వివిధ కాలనీలు, మండలంలోని గిర్మాపూర్, రాయిలాపూర్ తదితర గ్రామాలకు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ సమస్య పరిష్కారానికి సీసీరోడ్డు నిర్మాణం చేసి ఓ వైపు నుంచి వాహనాలు వెళ్లేలా తాత్కాలిక ఏర్పాట్లు చేశారు.

- బ్రిడ్జి పనులు పూర్తి కాలేదని ప్రధానంగా మేడ్చల్ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక వసతులు ఏర్పాటు చేశామని మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి తెలిపారు. బ్రిడ్జి పనులు జరుగుతుండటంతో అక్కడ పూర్తి లైటింగ్ ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గస్తీ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే పూర్తి స్థాయి రోడ్డు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.